సాక్షి
సూర్యాపేట
శనివారం ၊ 13 ၊ జనవరి ၊ 2024



హైవేపై అలర్ట్
పండుగకు వెళ్తున్న ప్రయాణికులకు హైవేపై ప్రమాదాలు జరగకుండా అధికారులు పక్కాగా చర్యలు తీసుకుంటున్నారు. - 10లో



చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ
కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ మత్స్య సహకార సంఘం చైర్మన్ ఎన్నిక ప్రక్రియ ఉత్కంఠగా మారింది. - 12లో



సంస్కృతిని చాటిచెప్పేలా..
తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పేలా సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు జిట్టా బాలకృష్ణారెడ్డి అన్నారు. - 12లో

న్యూస్‌రీల్

నూతనకల్ పీఏసీఎస్ చైర్మన్ తొలగింపు

నూతనకల్: నూతనకల్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్ కనకటి వెంకన్నను ఆ పదవి నుంచి తొలగించడంతోపాటు సంఘంలో ఆయన సభ్యత్వాన్ని రద్దు చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా సహకార అధికారి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం ఆధ్వర్యంలో వేబ్రిడ్జి నిర్మించడం కోసం రూ.5లక్షలు డ్రా చేసి నిర్మించకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో అసలుతోపాటు 18శాతం వడ్డీ చెల్లించాలని పలు దఫాలుగా నోటీసులు జారీ చేశారు. అయినా ఆయన స్పందించకపోవడంతో చర్యలు తీసుకున్నామని శ్రీధర్ తెలిపారు.

కార్మికులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న మేకల శ్రీనివాసరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కార్మికులకు అండగా ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా కార్మికుల బతుకులు మారడం లేదన్నారు. వివిధ చట్టాలను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో గౌరవ సలహాదారులు చామల అశోక్, ఉపాధ్యక్షులు షేక్ లతీఫ్, ఎం.శ్యాంసుందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం, జిల్లా సహాయ కార్యదర్శులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, నిమ్మల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను మూసి వేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రాష్ట్రవ్యాప్తంగా విచ్చలవిడిగా నడుస్తున్న బెల్టు షాపులను వెంటనే మూసి వేయించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేటలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ఐద్వా జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ స్కీములను తక్షణమే అమలు చేయాలని కోరారు. అభయస్తం పథకానికి సంబంధించిన డబ్బులు రూ.600 కోట్లు ఎల్ఐసీలో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేసి సమభావన సంఘాల సభ్యులకు పంచి పెట్టాలన్నారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలన్నారు. ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు మద్దెల జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు జులకంటి విజయలక్ష్మి, మొగిలిచర్ల రుద్రమ్మ, కుంకు ఆదిలక్ష్మి, అండం నారాయణమ్మ, బచ్చలకూరి మంగమ్మ, కొప్పుల రజిత తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలు పెంపు



71 డీబీఎం కాల్వలో పారుతున్న నీళ్లు

అర్వపల్లి: జిల్లాకు విడుదల చేస్తున్న గోదావరి జలాలను శుక్రవారం 1,330 క్యూసెక్కుల నుంచి 1,810 క్యూసెక్కులకు పెంచినట్లు నీటిపారుదల శాఖ ఏఈ అమర్ తెలిపారు. జనగామ జిల్లా కొడకండ్ల మండలం బయ్యన్నవాగు రిజర్వాయర్ నుంచి సోమవారం 500 క్యూసెక్కుల నీరు విడుదల చేయగా మంగళవారం 1,000 క్యూసెక్కులకు పెంచారు. బుధవారం 1,330 క్యూసెక్కులకు చేశారు. శుక్రవారం 1,810 క్యూసెక్కులకు పెంచారు. ఇందులో 69 డీబీఎంకు 535 క్యూసెక్కులు, 70 డీబీఎంకు 70 క్యూసెక్కులు, 71 డీబీఎంకు 1,205 క్యూసెక్కుల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు ఏఈ చెప్పారు. రైతులు కాల్వలకు నష్టం కలిగించకుండా నీటిని వాడుకోవాలని కోరారు.



సొంతూరుకు వెళ్లేందుకు సూర్యాపేట బస్టాండ్‌లో ప్రయాణికుడు

● పండుగకు పయనం



కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద ఆంధ్రా వైపు బారులుదీరిన వాహనాలు

● సంక్రాంతి రంగోలి



సూర్యాపేట ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ముగ్గుల పోటీలో పాల్గొన్న యువతులు, కళాశాల సిబ్బంది

పట్టభద్రులూ మేల్కోండి!

- నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 5,05,565 మంది ఓటర్లు
- ఈ నెల 11వ తేదీ వరకు 32,352 మంది మాత్రమే నమోదు
- పట్టభద్రులంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటున్న అధికారులు
- ఓటరు నమోదుకు ఫిబ్రవరి 6 చివరి గడువు



నల్లగొండ : నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటరు నమోదుకు పట్టభద్రుల నుంచి స్పందన తక్కువగా ఉంది. ఈ నియోజకవర్గంలో 2021లో నిర్వహించిన ఎన్నికల సమయంలో మొత్తం 5,05,565 మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి జనవరి 1వతేదీ నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా ఈ నెల 11వ తేదీ వరకు 32,352 మంది మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. గత ఎన్నికల్లో నమోదు చేసుకున్నవారు కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఓటరు నమోదుకు గడువు ఉందని 01–11–2023 కంటే మూడు సంవత్సరాల ముందు డిగ్రీ ఉత్తీర్ణత చెందిన పట్టభద్రులంతా ఫారం 18 ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు.

1 నుంచి ఓటరు నమోదు ప్రారంభం

నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఓటర్ల ముసాయిదా షెడ్యూల్‌ను ప్రకటించింది. జనవరి 1 నుంచి ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.

ఫిబ్రవరి 24వ తేదీన ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. అనంతరం అభ్యంతరాలను స్వీకరిస్తారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ వరకు తిరిగి రెండోసారి ఓటరు నమోదుకు అవకాశం కల్పిస్తారు. 2024 ఏప్రిల్ 24న ఓటరు తుది జాబితాను ప్రకటించనున్నారు.

పెరిగిన పట్టభద్రులు..

నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 12 కొత్త జిల్లాలు ఉన్నాయి. ఈ పరిధిలో గతంలో మొత్తం 5,05,565 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం పట్టభద్రుల సంఖ్య పెరిగింది. ఆ ప్రకారం అందరూ ఓటు హక్కు నమోదు చేసుకుంటే ఈ సారి ఓటర్ల సంఖ్య భారీగానే పెరిగే అవకాశం ఉంది.

నల్లగొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ 2021 ఎన్నికల్లో ఓటర్ల వివరాలు జిల్లా..

జిల్లా	ఓటర్ల సంఖ్య
నల్లగొండ	90,826
భువనగిరి	38,367
సూర్యాపేట	61,624
సిద్దిపేట	3,584
జనగామ	21,213
హన్మకొండ	66,379
వరంగల్	33,969
మహబూబాబాద్	36,633
ములుగు	10,323
భూపాలపల్లి	12,796
భద్రాద్రి కొత్తగూడెం	42,679
ఖమ్మం	87,172
మొత్తం	5,05,565

అందరూ ఓటు నమోదు చేసుకోవాల్సిందే..

గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంలో ఓటు హక్కు నమోదు చేసుకున్న ప్రతీ పట్టభద్రుడు ఈసారి కూడా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంది. గత ఎన్నికల్లో నిర్వహించిన ఓటరు జాబితా రద్దవుతుందని పట్టభద్రులంతా మళ్లీ నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ విషయంపై చాలా మందికి అవగాహన లేక గతంలో నమోదు చేసుకున్నాం కదా.. ఆ లిస్టు ప్రకారమే ఓటు వేయొచ్చనే అభిప్రాయంతో ఉన్నారని తెలుస్తోంది. అందువల్లే ఓటరు నమోదుకు పెద్దగా స్పందన రావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు పదేపదే పట్టభద్రులు అంతా ఓటు నమోదు చేసుకోవాలని చెబుతున్నా పెద్దగా స్పందించడం లేదు.

ఈ–చలాన్.. రూ.1.80కోట్లు

- డిసెంబర్ 26 నుంచి పెండింగ్ జరిమానాలు వసూలు
- నెలాఖరు వరకు గడువు పొడిగింపు
- వాహనదారులకు మరింత వెసులుబాటు



హుజూర్‌నగర్ : వాహనాల పెండింగ్ చలాన్‌లు చెక్ చేస్తున్న పోలీసులు (ఫైల్)

హుజూర్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు ఈ–చలాన్ల రూపంలో పోలీస్ శాఖ విధించిన జరిమానాలను రాయితీపై మూడు రోజుల క్రితం వరకు రూ.1.80కోట్లు వసూలు చేసింది. తొలుత ప్రభుత్వం రాయితీ ఈ–చలాన్లకు ఈనెల 10వ తేదీ వరకు అవకాశం ఇచ్చింది. ఇందులో భాగంగా భారీ వాహనాలపై 50 శాతం, ఆర్టీసీ బస్సులు, కార్లపై 60 శాతం, ద్విచక్ర వాహనదారులపై 80 శాతం, తోపుడు బండ్లపై 90 శాతం వరకు రాయితీ కల్పించింది. మొదటి నిర్ణయించిన చివరి తేదీ వరకు ఆశించిన స్థాయిలో వాహనాదారులు చెల్లింపులు చేయలేదు. దీంతో వాహనదారులకు మరింత వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఈనెలాఖరు వరకు ఈ–చలాన్‌ల చెల్లింపుల గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పటి వరకు జరిమానా చెల్లించని వాహనదారులకు ఊరట లభించినట్టు అయ్యింది.

2016 నుంచి ఈ–చలాన్ ప్రారంభం

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన ద్విచక్ర వాహనదారులకు ఈ–చలాన్ రూపంలో జరిమానాల విధించే ప్రక్రియ ఈ జిల్లాలో 2016 నుంచి ప్రారంభమైంది. హెల్మెట్ ధరించక పోవడంతో పాటు వాహనాలపై పరిమితికి మించి ప్రయాణించడం, ట్రాఫిక్ నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించే వాహనదారులను పోలీసులు ఫొటోలు తీసి వారికి ఈ–చలాన్‌ల రూపంలో జరిమానా విధిస్తున్నారు. దీంతో పోలీస్ శాఖకు ఒక రకంగా కాసుల వర్షం కురిపిస్తోంది.

జిల్లాలో 6.20 లక్షల మంది..

నాలుగేళ్లుగా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాన్ని నడిపిన 6.20 లక్షల మందికి విధించిన ఈ–చలాన్లు జిల్లాలో దాదాపు రూ.20 కోట్లు వరకు పెండింగ్‌లో ఉన్నాయి. రాయితీ ప్రకటించిన గత డిసెంబర్ 26 నుంచి ఈ నెల 10 వరకు 2.06 లక్షల మంది రూ.1.80 కోట్లు ఈ–చలాన్‌లను చెల్లించారు. ఇంకా సుమారు రూ.18 కోట్లు చెల్లించాల్సి ఉంది. ద్విచక్ర వాహనాలు మొదలు భారీ వాహనాల వరకు గడిచిన నాలుగేళ్లుగా పోలీసులు జరిమానాలు విధించారు. ప్రభుత్వ ఖజానాకు చేరకుండా పెండింగ్‌లో ఉన్న చలాన్ల వసూళ్లకు పోలీస్ శాఖ రాయితీ కల్పించడంతో వాహనదారులు చెల్లిస్తూనే ఉన్నారు. గత రెండు రోజులుగా అధిక మొత్తం చెల్లించినట్లు తెలుస్తోంది. ఈ–చలాన్ల చెల్లింపులో ప్రభుత్వం రాయితీ కల్పించడంతో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులకు ప్రయోజనం చేకూరుతోంది.

రాయితీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి. నిర్లక్ష్యంగా వాహనాలను నడిపినా, మద్యం తాగి నడిపినా చట్టపరమైన చర్యలు తప్పవు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చునే వారు కూడా హెల్మెట్ ధరించాలి. ఈ–చెలాన్ల విషయం ప్రభుత్వం కల్పించిన రాయితీ పథకాన్ని ఈనెలాఖరు వరకు సద్వినియోగం చేసుకోవచ్చు.

– రాహుల్ హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట

చెరువుల వేలానికి నోటిఫికేషన్ ఇవ్వాలి

- మత్స్యశాఖ అధికారికి కలెక్టర్ ఆదేశం
- 'చెరువుల్లో తిమింగలాలు' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

సూర్యాపేట: జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 98 చెరువుల బహిరంగ వేలానికి నోటిఫికేషన్ విడదల చేసి ప్రభుత్వ నిబంధనలకు లోబడి వేలం నిర్వహించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు శుక్రవారం మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. సొసైటీ లేని చెరువుల్లో చేపల పెంపకానికి అనుమతిస్తూ నిర్వహించే వేలం పాటలు ప్రహసనంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో 'చెరువుల్లో తిమింగలాలు' పేరుతో శుక్రవారం సాక్షి ప్రచురించిన కథనానికి జిల్లా కలెక్టర్ పై విధంగా స్పందించారు. అదేవిధంగా గతంలో నిర్వహించిన మూడు చెరువుల వేలాన్ని రద్దు చేస్తూ అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక నిర్ణయం తీసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట క్రైం: జిల్లా పోలీసు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భరోసా సెంటర్‌లో తాత్కాలిక పద్ధతిన నియమించే సెంటర్ కోఆర్డినేటర్–1, ఏఎన్ఎం–1, లీగల్ సపోర్టింగ్ పర్సన్–1 పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్పీ రాహుల్ హెగ్డే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లీగల్ సపోర్టింగ్ పర్సన్ కోసం 25 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వయసు కలిగి, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం అర్హత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఏఎన్ఎం పోస్టుకు 25 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగి బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు చేయడంతోపాటు ఏఎన్ఎంగా అనుభవం ఉండాలని, సెంటర్ కో–ఆర్డినేటర్‌కు 25 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగి సైకాలజీలో ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్హతతో పాటుగా అనుభవం ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు సూర్యాపేటలోని సువెన్ ఫార్మా వద్ద గల భరోసా కేంద్రంలో ఈనెల 20 వరకు దరఖాస్తులు అందజేయాలని కోరారు.


ఉద్యోగులు సేవాభావంతో పనిచేయాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉద్యోగులు

భానుపురి (సూర్యాపేట): ప్రభుత్వ ఉద్యోగులు సేవాభావంతో పనిచేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి తెలంగాణ బంజార ఎంప్లాయిస్ సేవా సంఘం జిల్లా శాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.మంగ్యా నాయక్, ప్రధాన కార్యదర్శి అజయ్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, సివిల్ సప్లయ్ అధికారి రాంపతి నాయక్, డీఈఓ అశోక్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి శంకర్, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సోమాని నాయక్, ధారాసింగ్, బాలునాయక్, పాండు నాయక్, లింగానాయక్, గోపీనాయక్, కృష్ణ, సందీప్, హుస్సేన్, తావూరియా, రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

బేతవోలు పీఏసీఎస్ చైర్మన్‌గా రవీందర్‌రెడ్డి



రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న డైరెక్టర్లు

చిలుకూరు: చిలుకూరు మండలం బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) తాత్కాలిక నూతన చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన డైరెక్టర్ బజ్జూరి రవీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ అంజయ్య, జిల్లా కోపరేటివ్ ఆడిటర్ అంబేద్కర్‌లు అత్యవసర సమావేశం నిర్వహించగా మెజారిటీ డైరెక్టర్ల మద్దతుతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గత చైర్మన్ సస్పెన్షన్‌తోనే ఎన్నిక

సంఘం గత చైర్మన్ బాషం సైదులు, వైస్ చైర్మన్ జానకిరామాచారి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా సంఘంలోని 13 మంది డైరక్టర్లకు గాను 9 మంది జిల్లా సహకార అధికారి శ్రీధర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ అనంతరం చైర్మన్ బాసం సైదులును ఇటీవల సస్పెండ్ చేశారు. అలాగే వైస్ చైర్మన్ అక్కినపల్లి జానకిరామాచారి నిబంధనలకు విరుద్ధంగా తన కొడుకును సంఘంలో ఉద్యోగిగా నియమించినందుకు అతన్ని కూడా సస్పెండ్ చేశారు. ఈ ఇద్దరిని చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు డైరెక్టర్ల పదవుల నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సంఘంలో 11 మంది డైరెక్టర్లు ఉండగా శుక్రవారం నిర్వహించి అత్యవసర సమావేశానికి 8మంది డైరెక్టర్లు హాజరు కావడం .. పూర్తిస్థాయిలో కోరం ఉండడంతో సంఘం నిర్వహణ, కార్యకలాపాలకు కోసం తాత్కాలిక చైర్మన్‌గా బజ్జూరి రవీందర్‌రెడ్డిని ఎన్నుకోవాలని మిగతా ఏడుగురు డెరెక్టర్లు సూచించి మద్దతు తెలిపారు. దీంతో జిల్లా సహకార అధికారులు సంఘం రవీందర్‌రెడ్డిని సంఘం తాత్కాలిక చైర్మన్‌గా ప్రకటించి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌ను డైరెక్టర్లు, సిబ్బంది సన్మానించారు.

చైర్మన్, వైస్‌చైర్మన్ల తొలగింపుపై స్టే ఆర్డర్

చిలుకూరు మండలం బేతవోలు పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లను తొలగిస్తూ ఇటీవల జిల్లా సహకార సంఘం అధికారి ఇచ్చిన ఉత్తర్వులపై హైదరాబాద్ కోఆపరేటివ్ ట్రిబ్యునల్ కోర్టు స్టే ఆర్డర్ జారీ చేసిందని ఆ సంఘం చైర్మన్ బాషం సైదులు శుక్రవారం విలేకరులకు తెలిపారు. సంఘంలో ఎలాంటి అవినీతి జరగలేదని, నిబంధనల ప్రకారమే పనిచేశామని ఈ మేరకు కోఆపరేటీవ్ ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించగా తననే చైర్మన్‌గా కొనసాగించాలని, అలాగే వైస్ చైర్మన్‌ను కూడా యథావిధిగా కొనసాగించాలని స్టే ఇచ్చినట్లుగా ఆయన పేర్కొన్నారు.

వైభవంగా కూడార్రై పాయస నివేదన





సూర్యాపేట శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పాయస నివేదనకు హాజరైన భక్తులు, స్వామివారికి ప్రత్యేక పూజ నిర్వహిస్తున్న అర్చకుడు

భానుపురి (సూర్యాపేట): పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం 27వ రోజు కూడార్రై పాయస నివేదన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 12 వందల గిన్నెల్లో భక్తులకు ప్రసాదాన్ని అందజేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు తెలిపారు. ఈ గిన్నెలు స్వామివారి ముందు ×కూడార్రై అనే పేరుతో అలంకరణ చేసి స్వామివారి తిరునామాలుగా తీర్చిదిద్దిన విధానం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో పాయసాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వేణుగోపాలాచార్యులు ధనుర్మాస విశిష్టతను, కూడార్రై పాయస వైభవాన్ని భక్తులకు తెలిపారు. అంతకుముందు స్వామివారు, అమ్మవారిని ప్రత్యేక పట్టు వస్త్రాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాసరెడ్డి, వికాస తరంగిణి భక్తులు టీఎస్‌వీ సత్యనారాయణ, బజ్జూరి కృష్ణయ్య, గజ్జల రవీందర్, మాధవరావు, మంజుల, సుభాషిని, అరుణ, సుమాల, పూరగాయత్రి, ఇరిగి కోటేశ్వరి పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హైవేపై అలర్ట్

- సంక్రాంతి పండుగ నేపథ్యంలో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ
- రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసు శాఖ చర్యలు
- జీఎంఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బంది నియామకం
- నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ శాఖ
- జంక్షన్ల వద్ద హైవేకు ఇరువైపులా స్టాపర్ల ఏర్పాటు



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : సంక్రాంతికి పట్టణాల నుంచి సొంతూళ్లకు వెళ్తుండడంతో గురువారం సాయంత్రం నుంచే హైదరాబాద్ – విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. ఈమేరకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని శాఖలు తగిన చర్యలు తీసుకుంటున్నాయి. ప్రధానంగా ఎన్‌హెచ్‌ఏఐ, పోలీస్‌శాలతోపాటు జీఎంఆర్ సంస్థలు ముమ్మరంగా పనిచేస్తున్నాయి. జంక్షన్ల వద్ద జాతీయ రహదారికి ఇరువైపులా జీఎంఆర్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో స్టాపర్‌లను ఏర్పాటు చేశారు.

నాలుగు క్లస్టర్లుగా విభజన

రంగారెడ్డి జిల్లా కొత్తగూడెం నుంచి చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలోని టోల్‌ప్లాజా వరకు 25కిలోమీటర్ల జాతీయ రహదారిని పోలీసులు నాలుగు క్లస్టర్లుగా విభజించారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక ఎస్‌ఐని నియ మించారు. ప్రత్యేకంగా పెట్రోలింగ్ చేయిస్తూ ట్రాఫిక్ జాం, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించేందుకుగాను వాహనాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఏసీపీ మొగిలయ్య, సీఐ దేవేందర్‌లు పర్యవేక్షిస్తున్నారు. హైవేపై బ్లాక్ స్పాట్‌లు, ప్రమాదకర జంక్షన్ల వద్ద జీఎంఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సిబ్బందిని అందుబాటులో ఉంచారు. అదేవిధంగా ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లోని రోడ్డు అంచులను తాత్కాలికంగా మట్టితో చదును చేయిస్తున్నారు. జాతీయ రహదారి వెంట దెబ్బతిన్న రోడ్డు ప్రాంతాల్లో ప్యాచ్ వర్క్ చేపట్టింది. ప్రమాదాలకు అవకాశం లేకుండా రేడియం స్టిక్కర్లు, జంక్షన్ల వద్ద లైట్లు ఏర్పాటు చేశారు.



దండుమల్కాపురం వద్ద హైవేపై రోడ్డు అంచులను చదును చేయిస్తున్న జీఎంఆర్ సిబ్బంది

చెక్‌పాయింట్‌ల వద్ద నిత్యం విధులు



ఎరసానిగూడెం స్టేజీ వద్ద ప్రమాదకరంగా ఉన్న క్రాసింగ్

కట్టంగూర్: కట్టంగూర్ మండల పరిధిలో జాతీయ రహదారి 14 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. పామనగుండ్ల, ఎరసానిగూడె, మాణిక్యాలమ్మగూడెం, కట్టంగూర్‌లోని నల్లగొండ క్రాస్‌రోడ్డు, శ్రీకృష్ణనగర్, అయిటిపాముల గ్రామశివారులోని చెర్వుఅన్నారం బస్‌స్టాప్ సమీపంలో హైవేపై ఉన్న క్రాసింగ్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు చోటు చేసుకోకుండా జీఎంఆర్ అధికారులు లైట్లు ఏర్పాటు చేశారు. బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించిన ఎరసానిగూడెం స్టేజీ వద్ద, అయిటిపాముల గ్రామ శివారులో చెర్వుఅన్నారం బస్‌స్టాప్ సమీపంలో గల క్రాసింగ్‌ల వద్ద ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పోలీసులు చెక్‌పాయింట్‌ను ఏర్పాటు చేశారు. హైవేపై ఉన్న టీ పాయింట్‌లు, హోటల్‌ల వద్ద రోడ్డు పక్కనే వాహనాలు నిలపకుండా ప్రత్యేక టీం ఏర్పాటు చేయటం జరిగింది. చెక్‌పాయింట్‌ల వద్ద 24 గంటలు విధులు నిర్వహించేలా ఆయా ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని ఎస్‌ఐ ఏర్పాటు చేశారు.

హైవేపై పోలీస్ పెట్రోలింగ్



మునగాల వద్ద బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన క్రాసింగ్

మునగాల : సంక్రాంతి పండుగ సందర్భంగా 65వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీని పరిశీలించేందుకు మునగాల పోలీస్ స్టేషన్ పరిధిలో 48 గంటల పాటు సిబ్బందితో హైవేపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ పి.లోకేష్ తెలిపారు. మునగాల స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 22కి.మీ పరిధి ఉందని, ఈ పరిధిలో మాధవరం, మొద్దులచెరువు, తాడువాయి, మునగాల, ముకుందాపురం, ఆకుపాముల గ్రామాల వద్ద క్రాసింగ్‌లు ఉండడంతో బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించామన్నారు. ముఖ్యంగా ముకుందాపురం, మునగాల, ఆకుపాముల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తమ స్టేషన్ పరిధిలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ గన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైవేపై ఉన్న గ్రామాల్లోని ప్రజలు రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

పద్మానగర్ జంక్షన్ వద్ద బారికేడ్లు



నకిరేకల్: పద్మానగర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

నకిరేకల్: నకిరేకల్ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదకరంగా మారిన పద్మానగర్ జంక్షన్ వద్ద నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంక్రాంతి నేపథ్యంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపుకు వాహనాలు భారీగా వెళ్తుండడంతో జీఎమ్మార్ సంస్థ ఆధ్వర్యంలో జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ఫాస్టాగ్ కౌంటర్ల ఏర్పాటు



ధర్మోజిగూడెం వద్ద ఏర్పాటు చేసిన ఫాస్టాగ్ కౌంటర్

చౌటుప్పల్: టోల్‌ప్లాజాల వద్ద రద్దీ నెలకొంటుంది. ఈ నేపథ్యంలో టోల్‌బూత్‌ల వద్దకు వెళ్లాకే రీచార్జ్ చేసుకునే బదులు.. టోల్‌ప్లాజాకు దూరంగా ఉన్న గ్రామాల వద్ద ప్రైవేట్ వ్యక్తులతో మాట్లాడి ప్రత్యేకంగా ఫాస్టాగ్ కౌంటర్లను అందుబాటులో ఉంచారు. దీంతో వాహనదారులు ఆయా కేంద్రాల వద్దకు చేరుకోగానే వాహనాన్ని ఆపి ఫాస్టాగ్‌ను పరిశీలించుకుని రీచార్జ్ చేసుకుంటున్నారు.

ప్రమాదకర ప్రాంతాల్లో స్టాపర్లు



చిట్యాల వద్ద జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసు

చిట్యాల: హైవేపై ప్రమాదాల నివారణకు పోలీసు శాఖతో పాటు, జీఎమ్మార్ సంస్థ ముందస్తు చర్యలు చేపట్టింది. క్రాసింగ్‌ల వద్ద, ప్రమాదాలు జరిగే చోట స్టాపర్‌లను ఏర్పాటు చేసింది. అనుకోని ప్రమాదాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1033 కాల్ చేస్తే అంబులెన్స్ సౌకర్యంతో పాటు, హైవేపై నిలిచిపోయిన వాహనాలను తొలగించేందుకు క్రేన్ సౌకర్యం కల్పించనున్నారు. అదేవిధంగా హైవేపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టనున్నారు. ట్రాఫిక్ నియంత్రణకుగాను చిట్యాల పోలీసులు ప్రత్యేకంగా ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు.

ప్రమాదాలు జరిగేదిక్కడే..

గుండ్రాంపల్లి గ్రామ శివారులోని మూలమలుపు వద్ద, వెలిమినేడు గ్రామ పరిధిలోని అంజనేయ స్వామి ఆలయం వద్ద, వెలిమినేడు నుంచి పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే దారిలో క్రాసింగ్ వద్ద, పెద్దకాపర్తి శివారులోని గాంధీ గుడి సమీపంలోని క్రాసింగ్ వద్ద, చిట్యాల పట్టణంలోని బస్‌స్టేషన్ ఎదురుగా, పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల క్రాసింగ్ వద్ద, రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో, వట్టిమర్తి గ్రామ బస్‌స్టేజీ వద్ద బ్లాక్ స్పాట్‌లుగా(ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా) గుర్తించారు. ఆయా చోట్ల స్టాపర్లను ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సంక్రాంతి పండుగ నేపథ్యంలో హైవేపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. వాహనదారులు గమ్యస్థానానికి త్వరగా చేరుకోవాలనే ఆతృతతో వాహనాలు అతివేగంగా నడుపుతుంటారు. దీంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. హైవేపై ప్రమాదాలు జరగకుండా బ్లాక్‌స్పాట్‌లున్న చోట స్టాపర్లను ఏర్పాటు చేశాం. అనుకోని ప్రమాదాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

– మహేష్, సీఐ, నార్కట్‌పల్లి

సీసీకెమెరాల ద్వారా నిత్యం పర్యవేక్షణ



దురాజ్‌పల్లి వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండల పరిధిలోని దురాజ్‌పల్లి నుంచి ఖాసీంపేట, వల్లభాపురం, గుంపుల, జి.తిర్మలగిరి, గుంజలూరు వరకు 17 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. ముఖ్యంగా దురాజ్‌పల్లి జంక్షన్ వద్ద నుంచి నేరేడుచర్ల, మిర్యాలగూడెం వెళ్లే వాహనాలు జాతీయ రహదారి క్రాసింగ్ చేసే సమయంలో ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. పెట్రోలింగ్ వాహనం ఏర్పాటు చేసి రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తంగా చేశారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.

ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం

విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. సీసీ కెమెరాల ద్వారా వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తున్నాం. ప్రత్యేక పెట్రోలింగ్ వాహనాల ఏర్పాటు చేశాం. హైవే వెంట ఉన్న గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– విష్ణుమూర్తి, ఎస్‌ఐ, చివ్వెంల

అదనపు సిబ్బందితో విధులు



జనగామ క్రాస్‌రోడ్డు వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్, ప్రత్యేక సిబ్బంది

సూర్యాపేట: సూర్యాపేట మండలం, చివ్వెంల, సూర్యాపేట పట్టణ పరిధిలో టేకుమట్ల, రాయినిగూడెం, జనగామ క్రాస్‌రోడ్డు, అంజనాపురి కాలనీ, రాజీవ్‌చౌరస్తా, కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డు క్రాసింగ్, ఎఫ్‌సీఐ గోడౌన్, దురాజ్‌పల్లి, ఖాసీంపేట, గుంజలూరు వద్ద పోలీసులు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ఈ ప్రదేశాల్లో కొంతమేర వాహనాల స్పీడ్‌ను తగ్గించేలా స్టాపర్స్ ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో స్పీడ్ లిమిట్ కోసం బ్లింక్ లైట్స్ అమర్చారు. అదేవిధంగా స్థానిక పోలీసు సిబ్బందితో పాటుగా ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బందిని కూడా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా హైవేపై ఉన్న అన్ని బ్లాక్స్ స్పాట్లలో ట్రాఫిక్ సిబ్బందితో పాటు ముగ్గురు సిబ్బందిని నియమించారు. అంతేకాకుండా నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

కేతేపల్లిలో నాలుగు యాక్సిడెంట్ స్పాట్లు



కేతేపల్లి : ఇనుపాముల వద్ద ఏర్పాటు చేసిన బ్లింక్ లైట్

కేతేపల్లి: మండలంలో ఇనుపాముల నుంచి ఉప్పలపహాడ్ వరకు 13కి.మీ. మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ మధ్యలో కొర్లపహాడ్, ఇనుపాముల, చీకటిగూడెం, కేతేపల్లి ఎస్సీకాలనీ జంక్షన్లను పోలీసులు యాక్సిడెంట్ స్పాట్‌లుగా గుర్తించారు. వాహనాల రద్దీ పెరుగుతుండడంతో హైవేపై ప్రమాదాల నివారణకు పోలీసు శాఖతో పాటు జీఎమ్మార్ సంస్థ ముందస్తు చర్యలు చేపట్టింది. క్రాసింగ్ జంక్షన్‌లు వాహనదారులకు దూరం నుంచే కనిపించే విధంగా రెండు వైపులా బ్లింక్ లైట్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా కొర్లపహాడ్‌లోని టోల్‌ప్లాజా నిర్వాహకులు, విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు టోల్ చెల్లించేందుకు అదనపు కౌంటర్లు కేటాయించారు. 12 కౌంటర్లలో ఏడింటిని విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు కేటాయించారు. దీంతో భారీ సంఖ్యలో వాహనాలు వస్తున్నా.. టోల్‌ప్లాజా వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదురవలేదు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు వీలుగా పోలీసు, ఆర్టీసీ సిబ్బందితోపాటు ప్రత్యేక సిబ్బందిని జీఎమ్మార్ సంస్థ నియమించింది.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

హాలియా: హాలియా పట్టణంలో శుక్రవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా పరిసర ప్రాంతాల్లో కొన్ని రోజులుగా పార్క్ చేసి ఉంచిన నంబర్ ప్లేట్ లేని ఏడు వాహనాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

● వాహనాల బారులు



హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిలోని బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



హైదరాబాద్ - విజయవాడ హైవేపై కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

హైవేపై కారు దగ్ధం



జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న కారు

చిట్యాల: హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో శుక్రవారం రాత్రి కారు దగ్ధమైంది. హైదరాబాద్‌కు చెందిన నల్లబెల్లి మోహన్‌రావు తన స్నేహితుడు శివతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి గుంటూరుకు వెళుతున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు వెలిమినేడు గ్రామ శివారులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే కారులో అకస్మాత్తుగా మంటలు లేచాయి. గుర్తించిన మోహన్‌రావు, శివ వెంటనే కారు దిగారు. కారు పూర్తిగా మంటల్లో కాలిపోయింది. కారులో షార్ట్‌సర్క్యూట్ జరగటంతోనే మంటలు లేచినట్లు తెలుస్తోంది. దీంతో ప్రమాద సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ఫైరింజన్ రప్పించి మంటలను ఆర్పించి వేశారు. ఈ ఘటనతో హైవే రోడ్డుపై వాహనాలు నిలిచిపోవటంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. స్థానిక పోలీసులు వెంటనే స్పందించి.. దగ్ధమవుతున్న కారును ఒక వైపునకు తీసుకెళ్లి హైవేపై ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మేళ్లచెరువు : ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేళ్లచెరువు మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని కీర్తి సిమెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న నేరేడుచర్ల మండలం కందులవారిగూడెం గ్రామానికి చెందిన ఒంటిద్దు అశోక్‌రెడ్డి (35) పరిశ్రమ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు పాల్పడుతూ తెలిసిన వారి దగ్గర అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై భార్యను పుట్టింటికి పంపించాడు. గురువారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. తండ్రి మట్టారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ.సురేష్ యాదవ్ తెలిపారు. కాగా.. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. తాము వస్తున్నామని, ఎంత సముదాయించినా వినలేదు. దీంతో చుట్టుపక్కల వారికి ఈ విషయాన్ని వారు ఫోన్ ద్వారా చెప్పారు. వారు వెళ్లేసరికి అశోక్‌రెడ్డి అప్పటికే ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడు.

ఏఎస్ రావు పరీక్షలో జయ విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేట టౌన్: ఐఐటీ ఫౌండేషన్ కొలమానంగా పరిగణించబడుతున్న డాక్టర్ ఏఎస్‌రావు అవార్డు కౌన్సిల్ వారు నిర్వహించిన 33వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ మొదటి లెవల్‌లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ ఒలింపియాడ్ పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జయ పాఠశాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. 9వ తరగతిలో 11మంది, 10వ తరగతిలో 21మంది రెండో లెవల్‌కు అర్హత సాధించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జిల్లా పద్మ పాల్గొన్నారు.



విద్యార్థులతో కరస్పాండెంట్ జయ వేణుగోపాల్

ఏసీబీకి చిక్కిన జిల్లా రవాణా అధికారి



ఏసీబీకి చిక్కిన సురేందర్‌రెడ్డి

భువనగిరి క్రైం : భువనగిరి జిల్లా రవాణా శాఖ అధికారి(డీటీఓ) శుక్రవారం ఏసీబీకి చిక్కాడు. భూదాన్ పోచంపల్లి మండలం కప్రాయపల్లి గ్రామానికి చెందిన గంగదేవి ప్రవీణ్ ఈ నెల 2న తన లారీ నేషనల్ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు డీటీఓ యాస సురేందర్‌రెడ్డి రూ.12,000 డిమాండ్ చేయడంతో ప్రవీణ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనతో.. రూ.5 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. శుక్రవారం డీటీఓ సురేందర్ రెడ్డి సూచనలతో ఆయన డ్రైవర్ మల్లికార్జున్‌కు ప్రవీణ్ రూ.5వేలు ఇవ్వబోగా అతను ఆర్టీఏ ఏజెంట్ భుషపాక అనిల్‌కుమార్‌కు ఇవ్వాలని చెప్పాడు. అతను మరో ఏజెంట్ దాసరి సురేష్‌కి ఇవ్వాలని సూచించగా ప్రవీణ్ సురేష్‌కు రూ.5వేలు ఇచ్చాడు. వెంటనే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డీటీఓ సురేందర్‌రెడ్డితో పాటు ఆర్టీఏ ఏజెంట్ అనిల్, సురేష్‌ను ఆధీనంలోకి తీసుకుని వారి దగ్గర రూ.5 వేలతో పాటు మరో రూ.24 వేలను మొత్తం 29,000 నగదు రికవరీ చేసినట్లు ఏసీబీ నల్లగొండ డీఎస్పీ శ్రీనివాస్ చెప్పారు. డ్రైవర్ మల్లికార్జున్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. సురేందర్ రెడ్డి అవినీతికి పాల్పడ్డట్టు పూర్తి ఆధారాలు ఉన్నాయని, భువనగిరిలోని రవాణా కార్యాలయంతో పాటు హైదరాబాద్‌లోని సురేందర్ రెడ్డి ఇంట్లో కూడా సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా సురేందర్‌రెడ్డి మోటార్‌వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) కాగా.. జిల్లా రవాణా శాఖ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పుష్పలతకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



అవార్డు అందుకుంటున్న పుష్పలత

సూర్యాపేట : సూర్యాపేట జిల్లాలోని నాగారం కేజీబీవీ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న ముల్కలపల్లి (చింత) పుష్పలతకు సావిత్రీబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయ 2024 అవార్డు లభించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సావిత్రీబాయి పూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి బోర సుభాష్, టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ రిసెర్చ్‌స్కాలర్ జంపాల రాజేష్, ఓయూ జేఏసీ నాయకులు వెంకట్, మురారి సతీష్, టీఎస్‌ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భారీ అశోక్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్య, నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చింత వెంకన్న, భూతం ఏకమల్లు, గురుకుల ఉపాధ్యాయురాలు మాధవి, స్వప్న మేరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రామకృష్ణ (ఫైల్)

హుజూర్‌నగర్ (చింతలపాలెం): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన చింతలపాలెం మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గుడిమల్కాపురానికి చెందిన బండారు రామకృష్ణ (34) తన స్నేహితుడితో కలిసి సొంత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై దొండపాడు వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోని కోల్డ్‌స్టోరేజీ వద్దకు రాగానే రోడ్డు పక్కన నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి కింద పడ్డాడు. దీంతో రామకృష్ణ తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కాగా.. రామకృష్ణ అవివాహితుడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ ఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.